సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 27 । మే । 2023



రాజన్నా నీవే రక్ష
వేములవాడ: రాజన్నను శుక్రవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



బ్యాంక్ భవనం పరిశీలన
వేములవాడఅర్బన్: వేములవాడలో నిర్మిస్తున్న కేడీసీసీబీ భవనం పనులను టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు శుక్రవారం పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
40.0/29.0

వాతావరణం
వాతావరణం ఎండగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నాణ్యతతో పనులు పూర్తి చేయండి



పనులు పరిశీలిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టిన పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సూచించారు. మోడల్‌స్కూల్ భవన సముదాయాలకు ప్రభుత్వం రూ.8కోట్లు మంజూరు చేసింది. ఆగయ్య మాట్లాడుతూ భవన నిర్మాణానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసిందని, ఆధునిక హంగులతో భవన పనులు జరుగుతున్నాయన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఆకుల మురళీమోహన్, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు పర్శరాములు, సందీప్, నారాయణ తదితరులు ఉన్నారు.

కల్యాణకట్టలోకి నీటి సరఫరా షురూ..



స్నానాలు చేస్తున్న భక్తులు

సాక్షి ఎఫెక్ట్..

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకుని తలనీలాలు సమర్పించుకునే భక్తుల కోసం ఏర్పాటు చేసిన కల్యాణకట్టలో ఇటీవల నీటి సరఫరా నిలిచిపోయింది. భక్తులు పడుతున్న కష్టాన్ని 'గుండెట్లా కడుక్కోవాలి' శీర్షికతో ఈనెల 25న 'సాక్షి' ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈవో కృష్ణప్రసాద్ ఆలయ ప్లంబర్ కమలాకర్‌ను ఆదేశించడంతో కల్యాణకట్టలోకి శుక్రవారం నుంచి నల్లా నీళ్ల సరఫరా అవుతున్నాయి.

విలాసాగర్ రైతులకు రూ.11 కోట్ల పరిహారం



చెక్కులు పంపిణీ చేస్తున్న సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు

బోయినపల్లి(చొప్పదండి): అదనపు టీఎంసీ వరద కాలువ నిర్మాణంలో భాగంగా భూసేకరణ చేసిన మండలంలోని విలాసాగర్‌కు చెందిన 72 మంది లబ్ధిదారులకు రూ.11 కోట్ల పరిహారం చెక్కులను సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆర్డీవోలు మాట్లాడుతూ వరదకాలువ నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. భూసేకరణలో భూములు, నిర్మాణాలు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం ఇస్తుందని తెలిపారు. తహసీల్దార్ దర్వెల్లి నరేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సెస్‌డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో గీత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో గీత సూచించారు. మండలంలోని నారాయణపూర్, రాచర్లబొప్పాపూర్‌లలో ఉన్నత పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న పనులను శుక్రవారం పరిశీలించారు. పనుల రికార్డులను తనిఖీ చేశారు. గీత మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం వరకు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని తూకం వేసి వారం రోజుల్లో కొనుగోళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో చిరంజీవి, పీఆర్ డీఈఈ, ఏఈఈ, ఎంపీవో వజీర్, సర్పంచులు కొండాపురం బాల్‌రెడ్డి, నిమ్మ లక్ష్మి, ఎంపీటీసీలు ఇల్లందుల గీతాంజలి, అపెరా సుల్తానా, ఏపీఎం మల్లేశం ఉన్నారు.

పంచాయితీ తేలేదెప్పుడో?

అదనపు టీఎంసీ వరదకాల్వ ముంపు గ్రామం దేశాయిపల్లి పంచాయితీ తేలడం లేదు. ఏడాదిలో రెండు సార్లు నిర్వహించిన గ్రామసభ వాయిదా పడిన విషయం తెలిసిందే. ఓటీఎస్.. ఆర్‌అండ్‌ఆర్‌పై గ్రామస్తులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. పునరావాసకాలనీ కావాలని కొందరు.. ఒకేసారి సెటిల్ చేయాలని మరికొందరు పట్టుబడుతున్నారు. దీంతో దేశాయిపల్లి ఆర్‌అండ్‌ఆర్ పంచాయితీ కొలిక్కిరావడం లేదు.

- పీడీఎఫ్ గెజిట్ పబ్లికేషన్‌పై తొలగని ఉత్కంఠ
- ఏడాదిలో రెండోసారి వాయిదాపడ్డ గ్రామసభ
- ఓటీఎస్ కావాలని కొందరు.. ఆర్‌అండ్‌ఆర్‌పై మరికొందరు
- ఆందోళనలో దేశాయిపల్లి గ్రామస్తులు



గ్రామసభలో అధికారులను చుట్టుముట్టిన బాధితులు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలంలోని దేశాయిపల్లి అదనపు టీఎంసీ వరదకాల్వలో ముంపునకు గురవుతుంది. 2022 మార్చి 9న అప్పటి డీఆర్వో భీమ్యానాయక్ నేతృత్వంలో జరిగిన తొలి గ్రామసభ ఎటూ తేల్చకుండానే వాయిదాపడింది. దేశాయిపల్లి కుటుంబాల గెజిట్ ప్రచురణపై ఏడాదిగా సస్పెన్స్ వీడడం లేదు. అదనపు టీఎంసీ వరదకాల్వలో పలు ఇళ్లు, కొట్టాలు ముంపునకు గురవుతున్నాయి. ముంపునకు గురవుతున్న కుటుంబాలను ప్రాజెక్టు డిస్‌ప్లేస్‌డ్ ఫ్యామిలీ (పీడీఎఫ్) అంటారు. పీడీఎఫ్ గెజిట్‌లో పేరు ఉన్న వారికి మాత్రమే ఆర్‌అండ్‌ఆర్ ముంపు ప్యాకేజీ, పరిహారాలు వస్తాయి. ఈక్రమంలో పీడీఎఫ్ గుర్తింపుపైనే ఆసక్తి ఉంది. మొదట 119 మందితో ఓ జాబితా.. తర్వాత 133 మందితో, ఇప్పుడు 144 నుంచి 150 మందితో ఓ జాబితా ఇలా పీడీఎఫ్‌ల అంకెల గారడి జాబితా బయటకు వస్తోందని ఆరోపణలు ఉన్నాయి. బుధవారం జరిగిన గ్రామసభలోనూ ఏడాదిలో ఎంత మంది పెరుగుతారని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. అధికారులకు గెజిట్ ఫైనల్, ఆర్‌అండ్‌ఆర్ వ్యవహారం తలనొప్పిగా మారింది.

ఓటీఎస్ వర్సెస్ ఆర్‌అండ్‌ఆర్

కాలువ నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న ఒక్కో నిర్వాసిత కుటుంబానికి రూ.6.60 లక్షల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.1.25లక్షల సాయం, 75 గజాల మేర ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు గతంలో నిర్వహించిన సభలో అధికారులు తెలిపారు. పై వాటికి బదులు ముంపు బాధితుల్లో కొందరు తమకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో స్థలం వద్దని, తమకు ఓటీఎస్ కింద డబ్బులు ఇవ్వాలని కోరుతున్నారు. నిర్వాసితులు ఏకాభిప్రాయంతో ఉంటే వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద రూ.11 లక్షల వరకు నగదు ఒక్కో పీడీఎఫ్ కుటుంబానికి ఇస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే కొందరు మాత్రం తమకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో స్థలం మాత్రమే కావాలని అంటున్నారు. దీంతో సమస్య ఓటీఎస్ వర్సెస్ ఆర్‌అండ్‌ఆర్‌లా మారింది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ స్థలం పీఎన్ పబ్లికేషన్ అయ్యింది. అది మార్చే పరిస్థితి లేదని ఆర్డీఓ చెప్పారు. దానికి తోడు కోర్టు పరిధిలో ఉంది. కోర్టు తీర్పు వస్తేనే ఈ సమస్యపై క్లారిటీ వస్తుంది. ఏదేమైన గ్రామస్తుల మధ్య ఏకాభిప్రాయం కుదిరితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరికేలా లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.15 లక్షలు ఇవ్వాలి



గ్రామంలో ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో స్థలానికి బదులుగా ఓటీఎస్ కింద రూ.15 లక్షలు ఇవ్వాలి. నగదుగా ఓటీఎస్ ప్యాకేజీ డబ్బులు ఇస్తే మేము ఇష్టం వచ్చిన చోట ఇల్లు కట్టుకుంటాం. రూ.11 లక్షల వరకు ఓటీఎస్ ఇస్తామన్నారు. పెరిగిన ధరలకు అవి సరిపోవు.

– పెంద్యాల మహిపాల్‌రెడ్డి, దేశాయిపల్లి

ఆమోదయోగ్య నిర్ణయం తీసుకోవాలి



గ్రామంలోని పలువురు రైతులు రెండోసారి కాలువ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం డబ్బులతో బయట మార్కెట్‌లో భూములు, ఇంటి స్థలాలు, ఇండ్లు దొరకడం లేదు. ప్రభుత్వం నిర్వాసితులపై సానుభూతి చూపించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలి.

– నిమ్మ శ్రీనివాసరెడ్డి, దేశాయిపల్లి

ఏకాభిప్రాయం రావాలి



ముంపు బాధితులు ఏకాభిప్రాయంతో ఉంటే సమస్యలు పరిష్కారమవుతాయి. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ స్థలం అంశం కోర్టు పరిధిలో ఉంది. కోర్టు తీర్పు వెలువడ్డాక నిర్ణయం ఉంటుంది. ఒకసారి పీఎన్ అయిన స్థలం మార్చే వీలు లేదు. మొత్తం మంది ఓటీఎస్ కింద డబ్బులు తీసుకుంటే ప్రయోజనం ఉంటుంది. కొందరు ఓటీఎస్, మరికొందరు స్థలం కావాలని, ఇంకొందరు స్థలం వద్దని ఇలా పలు రకాల వాదనలు వినిపిస్తున్నారు. ఆయా అంశాలను కలెక్టర్‌కు వివరిస్తాం.

– పవన్‌కుమార్, ఆర్డీఓ, వేములవాడ

ప్రగతి చాటేలా ఉత్సవాలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: జిల్లా ప్రగతి ప్రస్థానాన్ని చాటేలా రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జూన్ 2 నుంచి 22 వరకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు రోజువారి కార్యక్రమాల సమన్వయ అధికారులను నియమించినట్లు వెల్లడించారు. జూన్ 2 మొదటి రోజున రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు సిరిసిల్ల పాతబస్టాండులోని అమర వీరుల స్తూపానికి నివాళి అర్పిస్తారని తెలిపారు. కలెక్టరేట్‌లో గౌరవ వందనం స్వీకరించి ప్రజలనుద్దేశించి సందేశాన్నిస్తారని వివరించారు. జూన్ 3 నుంచి 22 వరకు నిర్వహించే కార్యక్రమాల షెడ్యూల్‌ను విడుదల చేశారు.

జిల్లాలో కంటివెలుగు సక్సెస్

- జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు



డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటివెలుగు విజయవంతమైందని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారంతో కార్యక్రమం ముగిసినట్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 2,47,815 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలన్న లక్ష్యంతో కార్యక్రమాన్ని రూపొందించగా.. 2,76,834 మందికి పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని 67 మున్సిపల్ వార్డులు, జిల్లా వ్యాప్తంగా 255 గ్రామాల్లో 26 బృందాలతో కంటివెలుగు కార్యక్రమం చేపట్టారు. ప్రణాళికాబద్ధంగా క్యాంపులు నిర్వహించగా..కంటి స్క్రీనింగ్ పరీక్షలను 1,29,450 పురుషులు, 1,47,284 మంది మహిళలు చేయించుకున్నారు. 47,194 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. చూపు సమస్య ఉన్న వారు 40,987 మందిని గుర్తించగా.. 29,655 మందికి అద్దాలు అందించామని మిగతా వారికి త్వరలోనే అందజేస్తామని డీఎంహెచ్‌వో వివరించారు.

పాలిసెట్‌లో మెరిశారు

- ఐదుగురికి అత్యుత్తమ ర్యాంకులు
- కోర్సులో చేరడంపై ఆలోచిస్తామన్న విద్యార్థులు



సోమినేని వైష్ణవి



దివిత

సిరిసిల్లఎడ్యుకేషన్/చందుర్తి/వేములవాడఅర్బన్(వేములవాడ): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో జిల్లా విద్యార్థులు మెరుగైన ర్యాంక్‌లు సాధించారు. ఇటీవల పాలిటెక్నిక్ ఇంజినీరింగ్, అగ్రికల్చరల్ విభాగంలో ప్రవేశాలకు ప్రభుత్వం పరీక్ష నిర్వహించింది. ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి ప్రవేశపరీక్ష రాసిన వారిలో ఐదుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. కొందరు దీనికంటే మంచి కోర్సును అందుకునేందుకు ప్రయత్నాలు చేస్తామని, పాలిటెక్నిక్‌కే ప్రథమ ప్రాధాన్యత నిస్తామని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. జిల్లాలో 1,859 మంది పాలిసెట్ రాయగా ఎంపీసీ విభాగంలో 1,515 మంది ర్యాంకులు సాధించగా, బైపీసీ విభాగంలో 1,544 మంది ర్యాంకులు సాధించినట్లు పాలీసెట్ జిల్లా కో ఆర్డినేటర్ రాజగోపాల్ వెల్లడించారు.

ప్రతిభ చూపింది వీరే..

సిరిసిల్లలోని వెంకంపేటకు చెందిన మహేషుని జశ్వంత్ ఎంపీసీలో 87వ ర్యాంకు సాధించగా ఇదే విద్యార్థి బైపీసీలో 41వ ర్యాంకు సాధించాడు. సిరిసిల్ల సంజీవయ్యనగర్‌కు చెందిన జలగం ప్రణవి 104వ ర్యాంకు, సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన మెరుగు ధనుశ్రీ 176, బైపీసీ విభాగంలో చందుర్తి మండలం మూడపల్లికి చెందిన సోమినేని వైష్ణవి 114వ ర్యాంక్ సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన సోమినేని వైష్ణవి పదోతరగతి పది జీపీఏ సాధించింది. వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధికి చెందిన కిరాణం వ్యాపారి ఆలంపల్లి శ్రీనివాస్– అర్చన దంపతుల కుమార్తె ఆలంపల్లి దివిత 143వ ర్యాంకు సాధించింది. ఎంపీసీలో ర్యాంకు సాధించిన విద్యార్థులు ఇంజినీరింగ్‌కు అర్హులని, బీపీసీలో ర్యాంకులు సాధించిన వాళ్లు అగ్రికల్చర్ విభాగానికి అర్హులని అధ్యాపకులు తెలిపారు.

సందిగ్ధంలో ఉన్నా..



నాకు బైపీసీలో 41, ఎంపీసీలో 87వ ర్యాంక్ వచ్చింది. పాలిటెక్నిక్ చేయాలా.. వద్దా.. అనేది మా నాన్నగారితో చర్చించాలి. నేను మోడల్ స్కూల్ మండేపల్లిలో పదో తరగతి చదివాను. టెన్త్‌లో 9.8 జీపీఏ సాధించాను. నాకు బాసర ట్రిపుల్ ఐటీ సీటు వస్తుందన్న నమ్మకం ఉంది. నాన్న రాజేందర్ ఎలక్ట్రీషియన్ షాపు నిర్వహిస్తుంటే, అమ్మ టైలరింగ్ చేస్తుంది.

– మహేషుని జశ్వంత్

అనుభవం కోసం రాశాను



నేను టెన్త్‌లో 10 జీపీఏతో పాసయ్యాను. పాఠశాలలో ఉండగానే పోటీ పరీక్షలు రాయాలన్న సార్ల ప్రోత్సాహంతో పాలిసెట్ రాశాను. ఎంపీసీలో 104వ ర్యాంకు వచ్చింది. 108 అంబులెన్స్‌లో పనిచేసే నాన్న సాగర్ రావు, అమ్మ మమత ప్రోత్సాహంతో చదివాను. ఇంటర్మీడియెట్ చేసి.. ఇంజినీరింగ్ వైపు వెళ్లాలనుకుంటున్న.

– జలగం ప్రణవి

మరికొంత ఆలోచించాకే..



నేను తంగళ్లపల్లి మండలం మండేపల్లి మోడల్ స్కూల్‌లో చదివాను. నాకు 9.5 జీపీఏ వచ్చింది. పాలిటెక్నిక్ రాస్తే పోటీ పరీక్షలపై అవగాహన వస్తుందని రాశాను. నాకు 176వ ర్యాంకు వచ్చింది. పవర్‌లూమ్ కార్మికునిగా పనిచేసే నాన్న రమేశ్, బీడీలు చేసే అమ్మ భాగ్యలక్ష్మి ప్రోత్సాహంతోనే చదివాను. పాలిటెక్నిక్ చేయాలనుకుంటున్న.

– మెరుగు ధనుశ్రీ

పచ్చబడ్డ గుండం నీళ్లు



వేములవాడ: రాజన్నను ఆలయ ధర్మగుండంలోని నీళ్లు పచ్చబడ్డాయి. దుర్వాసన వస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి సెలవులతో భక్తుల భారీగా తరలివస్తుండడంతో ధర్మగుండంలోని నీళ్లు కలుషితమవుతున్నాయి. ఎప్పటికప్పుడు నీళ్లను తొలగించకపోవడంతోనే కలుషితమవుతున్నాయి. దుర్వాసన వస్తుండడంతో స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

చిరుధాన్యాల లడ్డూ



వేములవాడ: రాజన్న భక్తులకు చిరుధాన్యాలతో తయారు చేసిన లడ్డూలను అందించాలని రాష్ట్ర దేవాదాయశాఖ భావిస్తోంది. కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశాలతో ప్రసాదాల తయారీ విభాగంలో శుక్రవారం చిరుధాన్యాలతో లడ్డూ తయారీపై శిక్షణ ఇచ్చారు. కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికెలు, కాజు, కిస్మిస్, పానకం వినియోగిస్తున్నట్లు ఆలయ అధికారులు వివరించారు.

గృహలక్ష్మి వరమా భారమా ?

- ఇంటి జాగా ఉన్న పేదలకు రూ.3లక్షలు
- పీఎంఏవై రూ.2 లక్షలు తోడైతే పూర్తిస్థాయి రేకుల ఇల్లు
- నిర్మాణరంగంపై పెరిగిన బొగ్గు ధరల ప్రభావం
- చదరపు అడుగుకు రూ.1,500 నుంచి రూ.2వేలకు పెంపు
- ఉమ్మడి జిల్లాలో 36 వేల మందికి రూ.10 కోట్లు కావాలి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన గృహలక్ష్మి పథకం సొంతింటి జాగా కలిగిన ఇల్లులేని పేదలకు వరమేనని బిల్డర్లు అంటున్నారు. రోజురోజుకు నిర్మాణ వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నేపథ్యంలో ఇల్లు కట్టుకునేందుకు జంకుతున్న నిరుపేదలకు ఈ పథకం అనుకూలమని నిర్మాణరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముందస్తు పథకం ప్రకారం.. ఖర్చు నిర్దేశించుకుని నిర్మాణం చేపడితే.. సకాలంలో పూర్తవడమే కాకుండా.. తక్కువ బడ్జెట్‌లో ఇల్లు చేతికి వస్తుందని అంటున్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న గృహలక్ష్మి పథకానికి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన్ (పీఎంఏవై) పథకం తోడైతే.. ఇంటి నిర్మాణం మరింత సులువు అవుతుందని వివరిస్తున్నారు.

భారీగా పెరిగిన నిర్మాణ వ్యయం

కరోనా తరువాత నిర్మాణ రంగంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని ప్రతీ నిర్మాణ రంగానికి మూలమైన ఇటుకల ధర భారీగా పెరిగింది. ప్రతీ జిల్లాలోని ఇటుకల తయారీకి ప్రధాన వనరు అయిన ఎన్టీపీసీ ఫ్లైయాష్‌ను టెండర్లకు ఇవ్వడం ఇందుకు ప్రధాన కారణం. తద్వారా ఒకప్పుడు అక్కడ 30 టన్నుల బూడిదలారీని రూ.700కి ఇచ్చేవారు. ప్రస్తుతం అది రూ.12వేలకు చేరింది. ఫలితంగా ఇటుకల ధరలు పెరిగాయి. రాష్ట్రంలో ప్రతీ ఇంటి నిర్మాణంపై దాదాపు రూ.30వేల అదనపు భారం పడుతోంది. ఇటీవల బొగ్గు ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. దీంతో ఇటుకల పరిశ్రమలో ఉత్పత్తి చేసిన ఇటుకలను కాల్చేందుకు ఊక(ఉనుక)తోపాటు బొగ్గును వాడుతారు. దాని ప్రభావం ఇటుకల ధరలపై పడుతోంది. బొగ్గు ధరల ప్రభారం స్టీలుపైనా ఉందంటున్నారు. ఫలితంగా 2021 వరకు రూ.7లుగా ఉండే మట్టి ఇటుక ధర ప్రస్తుతం రూ.9 నుంచి రూ.10వేలకు చేరుకోవడం వెనక కారణం ఇదే.

గృహలక్ష్మికి పీఎంఏవై జత కలిస్తే

ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం.. చదరపు అడుగుకు రూ.2వేల వరకు బిల్డర్లు వసూలు చేస్తున్నారు. కరోనాకు ముందు ఇది రూ.1500గా ఉండేది. ఒక మధ్య తరగతి కుటుంబం పిల్లర్లు వేసి 800 చదరపు అడుగుల డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని నిర్మించుకుంటే.. దాదాపుగా రూ.16 లక్షల వరకు ఖర్చవుతోంది. ఇదే గృహలక్ష్మి పథకంలో నిర్మాణం చేపడితే.. రూ.3 లక్షలు ఏ మూలకు సరిపోవు. ఇక్కడే నిర్మాణరంగ నిపుణులు మరో ఆలోచన ముందుంచుతున్నారు. నివాసగృహం లేని వారంతా ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై) కింద దరఖాస్తు చేసుకుంటే మరో రూ.2లక్షలు కూడా వస్తాయని గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.3లక్షలకు కేంద్రం నుంచి వచ్చే రూ.2 లక్షలు జతకలిస్తే ప్రతీ లబ్ధిదారునికి కొండంత అండగా ఉంటుందని సలహా ఇస్తున్నారు. ఇంకా చెప్పాలంటే.. పేదింటిని 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.3లక్షలతో డబుల్ బెడ్ రూం, హాల్, కిచెన్‌తో కూడిన రేకులషెడ్ నిర్మాణం చేయవచ్చు. మిగిలిన రూ.2లక్షలతో తలుపులు, కిటికీలు, లోపల షెల్ఫులు, సీలింగ్ కూడా చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అదే మధ్య తరగతి కుటుంబాలు ఈ రూ.5 లక్షలకు మరికొన్ని డబ్బులు కలుపుకుని, లేదా బ్యాంకు రుణాలు తీసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవచ్చని వివరిస్తున్నారు.

36 వేల మందికి రూ.10 కోట్లు కావాలి

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలుగా వర్గీకరించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నాలుగు కొత్త జిల్లాల పరిధిలో మాత్రం 12 ఉన్నాయి. ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా ప్రతీ నియోజకవర్గానికి 3000 మంది లబ్ధిదారుల చొప్పున మొత్తం 36,000 మందిని ఎంపిక చేస్తారు. వీరికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేయడానికి మొత్తం రూ.10.08 కోట్లు నిధులు కావాల్సి ఉంటుంది.

సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్యకు పదోన్నతి లభించింది. స్పెషల్‌గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. సిరిసిల్లలో ఫస్ట్ గ్రేడ్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన సమ్మయ్యను సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి అభినందించారు.



కమిషనర్ సమ్మయ్యను అభినందిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి దంపతులు

క్లుప్తంగా

నమ్మకంతో రండి.. నాణ్యమైన విద్యనందిస్తాం



విద్యార్థి ప్రవేశపత్రం రాస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తమపై నమ్మకంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరితే నాణ్యమైన బోధన చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ పేర్కొన్నారు. మండలంలోని రాగట్లపల్లి, దుమాల గ్రామాల్లో శుక్రవారం విద్యార్థుల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ కళాశాలలో అందిస్తున్న విద్య, సదుపాయాలు, ఫలితాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పది మంది విద్యార్థులు కళాశాలలో చేరుతున్నట్లు అంగీకార పత్రాలు రాసి ఇచ్చారు. అధ్యాపకులు వాసరవేణి పర్శరాములు, చంద్రమౌళి ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి



మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతి కార్యకర్త పోరాడాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం మహాజన్ సంపర్క్ అభియాన్ 30 రోజుల కార్యక్రమంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోదీ చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై నిలదీయాలన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు కొక్కు దేవేందర్, లక్ష్మారెడ్డి, కోనేటి సాయిలు, రాజిరెడ్డి, కిరణ్, స్వామి, రామచంద్రరెడ్డి, రాజు, యాదగిరి, శ్రీకాంత్, సాయికుమార్, పర్శరాములు, ప్రశాంత్, సత్యంరెడ్డి, శరత్‌రెడ్డి, దేవయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్‌కే ముషారఫ్ రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు (హ్యాండ్‌బాల్) ఎంపికయ్యాడు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి ఈనెల 28, 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ముషారఫ్ పాల్గొంటాడు. ఆయనను పాఠశాల హెచ్ఎం శంకర్, పీఈటీ భాను, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిసిల్లలో చేప ఆహార ఉత్పత్తుల మేళా

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని సమీకృత రైతు మార్కెట్‌లో చేప ఉత్పత్తుల ఆహార మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు. జూన్ 8 నుంచి 10 వరకు జరిగే కార్యక్రమంలో 10 స్టాల్స్ ఏర్పాటు చేసి వంటల్లో అనుభవం, ప్రత్యేక శిక్షకులతో వివిధ రకాల రొయ్యల ప్రత్యేక వంటల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఐటీహెచ్ఎంలో శిక్షణ పొందిన మహిళలు, మహిళా మత్స్యకారులు, మహిళ మత్స్య పారిశ్రామిక సహకారం సంఘాల ప్రతినిధులు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, మత్స్యకార కమ్యూనిటీకి చెందిన వారు, ఔత్సాహికులు ముందస్తుగా తమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

కార్మికుల ఆస్పత్రిలో వైద్యసేవలు కరువు

- మూలనపడ్డ పరికరాలు
- శాభాష్‌పల్లికి రవాణా లేక ఇబ్బంది
- మందులతోనే సరిపెడుతున్న వైద్యసిబ్బంది



శాభాష్‌పల్లిలోని బీడి కార్మిక సంక్షేమ ఆసుపత్రి

వేములవాడఅర్బన్: బీడికార్మికులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సిరిసిల్లలో బీడికార్మిక ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. చాలీచాలని వైద్య సిబ్బందితో కార్మికులకు సరైన వైద్యం అందడం లేదు. బెడ్స్‌ను మూలకు పడేశారు. వైద్య పరికరాలు ఉపయోగించకపోవడంతో పనికిరాకుండా పోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో బీడి కార్మికుల ఆస్పత్రిలో వైద్యసేవలు అధ్వానంగా ఉన్నాయి.

2012లో ప్రారంభం

బీడికార్మికులు ఎక్కువగా ఉండే సిరిసిల్ల ప్రాంతంలో 2012, సెప్టెంబర్ 15న కేంద్రీయ కార్మిక ఆస్పత్రిని ప్రభుత్వం ప్రారంభించింది. కరీంనగర్ అప్పటి ఎంపీ పొన్నం ప్రభాకర్ చొరవతో ఆస్పత్రి ఏర్పాటైంది. అప్పటి కేంద్ర కార్మికశాఖ మంత్రి మల్లికార్జునఖర్గే ఆస్పత్రిని ప్రారంభించారు. ఆస్పత్రి కోసం సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు వద్ద స్థలం మంజూరు చేశారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక భవనంలో 15 పడకలతో ఆస్పత్రిని ప్రారంభించారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని శాభాష్‌పల్లి పునరావాసకాలనీలోని పాఠశాల భవనంలో ఆస్పత్రి నిర్వహిస్తున్నారు.



బీడి కార్మిక ఆసుపత్రిలో మూలనపడ్డ వైద్య పరికరాలు

నామమాత్రంగా వైద్యసేవలు

బీడి కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో 15 బెడ్లతోపాటు ల్యాబ్ సౌకర్యం కల్పించారు. ఇప్పటి వరకు ఒక్క రోగి కూడా ఇక్కడ చేరి చికిత్స పొందిన రికార్డులు లేవు. పూర్తి స్థాయిలో వైద్యం అందింది లేదు. వివిధ జబ్బులతో వచ్చిన రోగులకు మందులు ఇచ్చి పంపించి వేస్తున్నారు. నిత్యం పది మంది వరకు రోగులు వస్తున్నారు. ఎంతో దూరం నుంచి రవాణా ఖర్చు భరించి వస్తే కనీసం పరీక్షలు కూడా చేయడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరకొర వైద్యసిబ్బంది

బీడి కార్మిక సంక్షేమ ఆస్పత్రిలో వైద్యుడు, స్టాఫ్‌నర్సు, ఫార్మసిస్టులు ముగ్గురు ఉన్నారు. అందులో 2022 మార్చి నుంచి డాక్టర్ స్టడీలీవ్‌లో వెళ్లారు. డిప్యుటేషన్‌పై సిరిసిల్ల మెడికల్ ఆఫీసర్ మహేందర్ ప్రతీ సోమవారం వస్తుంటారు. మిగతా రోజుల్లో సిరిసిల్లలోని ఆస్పత్రిలో సేవలందిస్తుంటారు. ఫార్మసిస్టు పోస్టు ఖాళీగా ఉంది. ఆఫీస్ వర్క్‌కు అవుట్ సోర్స్ సిబ్బంది నలుగురు ఉన్నారు.

మూలనపడ్డ వైద్యపరికరాలు

ఆస్పత్రిలో వైద్యులు పూర్తిస్థాయిలో లేకపోవడం, అందులోనే ప్రాథమిక పాఠశాల ఉండటం, మూడు గదులు మాత్రమే ఆస్పత్రికి కేటాయించడంతో గదులు సరిపోవడం లేదు. ఫలితంగా ఆసుపత్రి ప్రారంభంలో వచ్చిన వైద్యపరికరాలు, బెడ్‌లు, ల్యాబ్ పరికరాలను ఓ గదిలో మూలనపడేశారు. శాభాష్‌పల్లిలోని ఆసుపత్రికి వచ్చేందుకు రవాణా సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. రవాణాకు అనుకూలంగా ఉన్న సిరిసిల్లకు ఆస్పత్రిని మారిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మందులు ఉన్నాయి



వివిధ రకాల వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే బీడి కార్మికులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. బీడి కార్మికులు ఈ ఆస్పత్రిలో అందే వైద్య సేవలను వినియోగించుకోవాలి.

– మహేందర్, మెడికల్ ఆఫీసర్

న్యాక్ ఆధ్వర్యంలో స్కిల్ అప్‌గ్రేడేషన్ ట్రైనింగ్

సిరిసిల్లటౌన్: తెలంగాణ లేబర్ డిపార్ట్‌మెంట్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(న్యాక్) ఆధ్వర్యంలో వివిధ వృత్తుల్లో పనిచేస్తున్న వారికి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు న్యాక్ సెంటర్ ఇన్‌చార్జి గోలి ప్రకాశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. లేబర్‌కార్డు కలిగి ఉన్నవారే అర్హులుగా పేర్కొన్నారు. శిక్షణలో తాపీమేస్త్రీ, ప్లంబర్, పేయింటర్, ఎలక్ట్రీషియన్, మహిళలకు మూడు నెలల ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులు, ఆసక్తి గల వారు సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్ పక్కనే గల న్యాక్ శిక్షణ కేంద్రంలో ఈనెల 31 వరకు దరఖాస్తులు అందించాలని కోరారు. వివరాలకు 98663 34841, 94404 62346లో సంప్రదించాలని సూచించారు.

29న గురుకులంలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల, మరిమడ్ల గిరిజన గురుకుల ఆశ్రమ బాలికల కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 29న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దుమాల, మరిమడ్ల గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఇప్పటికే విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పదో తరగతిలో వారికి వచ్చిన జీపీఏల ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో కౌన్సిలింగ్‌లో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉన్న ఖాళీల మేరకు ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

సైనికుల్లా పనిచేయాలి



పార్టీ శ్రేణులతో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. రుద్రంగిలోని శుభం గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. సబ్బండ వర్గాలు ఏకమై పోరాడి తెచ్చిన తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబ సభ్యుల కోసం తెచ్చినట్లయిందన్నారు. కేసీఆర్ నియంతృత్వ మోసపూరిత పాలనను, నెరవేర్చని బీఆర్ఎస్ ఎన్నికల హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ మండలాధ్యక్షుడు బైరి గంగమల్లయ్య, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లింగారెడ్డి, నాయకులు పల్లి గంగాధర్, గండి నారాయణ, ద్యావల శంకర్, రవి, ధార్న మల్లేశం, యాదయ్య, తూం జలపతి, జక్కు వంశీ పాల్గొన్నారు.

జర్నలిస్టుల విశ్వాసాన్ని కాపాడుకుంటాం

- టీయూడబ్ల్యూజే ఐజేయూ ప్రధానకార్యదర్శి విరాహత్‌అలీ
- రాజన్న సిరిసిల్ల జిల్లా మహాసభ
- నూతన జిల్లా కార్యవర్గం నియామకం



మాట్లాడుతున్న విరాహత్ అలీ

వేములవాడఅర్బన్: జర్నలిస్టుల్లో ఐక్యతను కాపాడుతూ.. పోరాటాలతో హక్కులను సాధించుకోవడమే తమ ఏకైక లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే-ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ పేర్కొన్నారు. వేములవాడలోని భీమేశ్వర గార్డెన్‌లో శుక్రవారం జిల్లా మహాసభ నిర్వహించారు. విరాహత్ అలీ మాట్లాడుతూ తమ సంఘానికి 60 ఏళ్లకు పైగా అనుభవం, సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. జర్నలిస్టుల కనీస సౌకర్యాలైన ఇళ్లస్థలాలు, ఇళ్లు, ఆరోగ్య భద్రత, పిల్లలకు ఉచిత విద్య, విశ్రాంత జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం సాధించే వరకు పోరాడుతామన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.కరుణాకర్ మాట్లాడుతూ మీడియా విస్తరించడం శుభపరిణామమే అయినప్పటికీ.. కొన్ని శక్తులు వృత్తికి చెడ్డపేరు తేవడం సహించరానిదన్నారు. ఈ మహాసభకు జిల్లాలోని 13 మండలాల నుంచి 350 మంది జర్నలిస్టులు హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లా కార్యవర్గం

రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా దండి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ మజీద్, రాచమడుగు వెంకటేశ్వరరావు, సీహెచ్ జగదీశ్‌కుమార్, రవీందర్, ప్రసాద్, తడక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కాంభోజ ముత్యం, సంయుక్త కార్యదర్శులుగా వేణుకుమార్, మధుసూదన్, అనిల్, మహేందర్, అరుణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా శ్రీనివాస్, పి.శ్రీనివాస్, సూర్యకిరణ్, రంజిత్‌కుమార్, కోశాధికారిగా గంగు సతీశ్, కార్యవర్గ సభ్యులను నియమించారు. జిల్లా అధ్యక్షుడు భద్రాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి దేవేందర్, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

- చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి(వేములవాడ): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. చందుర్తిలోని రైతువేదికలో శుక్రవారం విత్తన డీలర్లతో సమావేశమయ్యారు. సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో విక్రయాలతో ఆశించిన దిగుబడులు రాక రైతులు నష్టపోయి, ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. నకిలీ విత్తనాల కట్టడికి వ్యవసాయశాఖ అధికారులతోపాటు పోలీసుల నిఘా ఉందన్నారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్‌తోపాటు విత్తనాలను విక్రయించే సమయంలో రైతులకు బిల్లు రశీదులు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. బిల్లు రశీదులపై లాట్ నంబర్‌తోపాటు బ్యాచ్ నంబర్‌ను రశీదుపై నమోదు చేయాలని సూచించారు. అనంతరం వ్యవసాయాధికారులు ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ప్రణీత, చందుర్తి ఎస్సై రమేశ్, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



గాయపడ్డ సోహైల్

వేములవాడ: వేములవాడ పట్టణంలోని మూలవాగు వంతెనపై శుక్రవారం ఆటో అదుపు తప్పి డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని కరీంనగర్‌కు తరలించారు. స్థానిక సుభాష్‌నగర్‌కు చెందిన సోహైల్ అతిగా మద్యం తాగి ఆటో నడుపుతున్నాడు. ఈక్రమంలో మూలవాగు వంతెనపై ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఆటో నడుపుతున్న సోహైల్ ఆటోకింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆటోడ్రైవర్ సోహైల్‌ను చికిత్స కోసం కరీంనగర్ తరలించారు.

బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి

- 30 నుంచి 'మహాజన్ సంపర్క్ అభియాన్'
- జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి



మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్లటౌన్: బీజేపీ పాలనలోనే దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన పట్టణ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్లలో నరేంద్రమోదీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు మహాజన్ సంపర్క్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు బర్కం లక్ష్మీయాదవ్, శిరస్వాల్ కైలాస్, కొండ నరేశ్, ఎనగంటి నరేశ్, చొప్పదండి అంజన్న పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణానికి కారణమైన ముగ్గురి అరెస్టు

చందుర్తి(వేములవాడ): భార్యభర్తల కాపురంలో కలహాలు రావడంతో పంచాయితీ చేసిన సర్పంచ్ భర్తతోపాటు మృతుని భార్య, బావమరిదిని శుక్రవారం అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని కొత్తపేటకు చెందిన తీపిరెడ్డి శ్రీనివాస్(35) భార్య కాపురానికి రాకపోవడంతో బుధవారం రాత్రి పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. శ్రీనివాస్ మరణానికి కథలాపూర్ మండలం బొమ్మెనకు చెందిన రెండో భార్య జెట్టి లత, ఆమె తమ్ముడు జెట్టి కిషన్, బొమ్మెన సర్పంచ్ భర్త పిడుగు తిరుపతిరెడ్డిలపై మృతుడు శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.


బావిలో దూకి వివాహిత ఆత్మహత్య



రింజుదేవి(ఫైల్)

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామంలో రింజుదేవి (32) వివాహిత శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువులు, బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దినేష్‌గుప్తా ఆరేళ్ల కిత్రం జయ్యారం గ్రామానికి ఉపాధికోసం వచ్చాడు. ధర్మారం క్రాస్‌రోడ్డులోని బోడగుట్ట స్టోన్ క్రషర్‌లో క్రషర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. దినేష్‌గుప్తా భార్య రింజుదేవి మానసిక స్థితి మూడేళ్లుగా బాగుండడం లేదు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ ఎలాంటి మార్పులేదు. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున దినేష్‌గుప్తా స్నానం చేస్తుండగా ఇంటి నుంచి బయటకు వచ్చిన రింజుదేవి గ్రామశివారులోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తన భార్య ఇంట్లో కనిపించకపోవడంతో దినేష్ గుప్తా గ్రామంలో వెతకగా స్థానికులు అందించిన సమాచారంతో ఎల్లమ్మ ఆలయం వైపు వెళ్లాడు. అనుమానంతో బావిలోకి చూడగా శవం తేలియాడుతూ కనిపించింది. వెంటనే స్థానికులకు సమాచారం అందించడంతో వా రు బసంత్‌నగర్ పోలీసులకు స మాచారం అందిచారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లిమృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

కాబోయే వైద్య విద్యార్థుల విజ్ఞానయాత్ర



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న యశోద ఆస్పత్రి యాజమాన్యం

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ..కాబోయే వైద్యవిద్యార్థుల కోసం మంత్రి కేటీఆర్ చొరవతో విజ్ఞానయాత్రను జిల్లా వైద్య, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. గివ్ తెలంగాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల, తంగళ్లపల్లి, వేములవాడ మండలాల నుంచి పలువురు విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రి సందర్శించారు. తొమ్మిదో తరగతి చదివి, ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులను ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది. ఆస్పత్రి యాజమాన్యం నిర్వహించే యంగ్ డాక్టర్స్ క్యాంపులో పాల్గొంటారని ఎంఈవో రఘుపతి తెలిపారు. 44 మంది విద్యార్థులు పాల్గొనగా నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గివ్ తెలంగాణ ఫౌండేషన్ ప్రతినిధి శిరీష్, వైద్యశాఖ కోఆర్డినేటర్ శైలజ పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు రోజూ పర్మిషన్ ఇవ్వండి



మాట్లాడుతున్న కడారి రాములు

సిరిసిల్లటౌన్: వారంలో రెండు రోజులు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వడం ద్వారా అదనపు ట్రిప్పులు కొట్టాలన్న కొందరు వేగంగా వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని.. దీన్ని దృష్టిలో పెట్టుకొని నిత్యం పర్మిషన్‌లు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. సిరిసిల్లలోని కార్మికభవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. అజ్జ వేణు, మంచికట్ల రమేశ్, ఒడ్డెపల్లి లక్ష్మణ్, లింగమూర్తి, రాములు పాల్గొన్నారు.

రైల్లోంచి జారిపడి విద్యార్థి మృతి

పెద్దపల్లిరూరల్: రైల్వేస్టేషన్ సమీపంలోని కూనారం రైల్వేక్రాసింగ్ వద్ద శుక్రవారం భాగ్యనగర్‌లో ప్రయాణిస్తున్న విద్యార్థి ప్రమాదవశాత్తు జారీ అదే రైలు కిందపడి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం తంగళ్లపల్లికి చెందిన రోహిత్(22) ఇంటర్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం రేచిన్‌రోడ్ రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్కి ప్రయాణిస్తూ పెద్దపల్లి స్టేషన్ దాటిన కొద్దిదూరంలోనే ప్రమాదవశాత్తు జారి రైలుకిందపడి మృతిచెందాడు. మృతుడి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు రైల్వేపోలీసులు తెలిపారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించండి



కోనరావుపేటలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

కోనరావుపేట(వేములవాడ): సమ్మె చేస్తున్న వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు కోరారు. కోనరావుపేటలో సమ్మె చేస్తున్న వీవోఏలకు శుక్రవారం మద్దతు తెలిపి మాట్లాడారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి.. రూ.26వేల వేతనం అందించాలని కోరారు. వీవోఏలకు రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్యబీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, రాష్ట్ర నాయకులు ఎర్రం మహేశ్, బైరగోని సురేశ్, బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగుండం: ఈనెల 22న పెద్దపల్లి నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న దూస మల్లేశం అనే వ్యక్తి మల్యాలపల్లి శివారులో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తలతో పాటు కంటిపై బలమైన గాయాలవడంతో మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడు మంచిర్యాల జిల్లాకేంద్రంలోని సున్నంబట్టీవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రామగుండం ఎస్సై బత్తుల శరణ్య తెలిపారు.